ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 21 సెప్టెంబరు 2024

డిప్లొమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఆరు నెలల కాలవ్యవధి గల ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30లోగా నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి, విద్యార్హత జిరాక్స్ పత్రాలతో వర్సిటీ విద్యావిభాగానికి దరఖాస్తులను అందజేయాలి. ఇతర వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ బీఆర్‌ఏయూ డాట్ ఈడీయూ డాట్ ఇన్‌లో పరిశీలించాల'ని ఆమె తెలిపారు.

ఇది మంచి ప్రభుత్వం

- వంద రోజుల పాలనలో జిల్లాకు ఎంతో మేలు
- అన్ని వర్గాల ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు
- పింఛన్ల మొత్తం పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం
- కూటమి పాలనపై సర్వత్రా హర్షాతిరేకాలు



కవిటి: రాజపురంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఆమదాలవలస: వెంకయ్యపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్



నరసన్నపేట : కోమర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



మెళియాపుట్టి : చాపరలో బ్రోచర్‌ను విడుదలు చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



అరసవల్లి: ఏపీహెచ్‌బీ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్



ఎచ్చెర్ల : కుప్పిలిలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

రాష్ట్రంలోనే అత్యంత తక్కువ తలసరి ఆదాయం గల సిక్కోలు.. గత వైసీపీ పాలనలో అభివృద్ధి పరంగా మరో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువు దీరిన వంద రోజుల్లోనే.. గణనీయమైన మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వంద రోజుల కూటమి పాలనలో చేకూరిన లబ్ధిపై నేరుగా లబ్ధిదారులతో మాట్లాడేందుకుగాను సీఎం చంద్రబాబు 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం మంత్రులు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆరు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలిరోజు ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. వంద రోజుల పాలనపై కూటమి శ్రేణులు ఆరా తీయగా.. లబ్ధిదారుల నోట.. 'ఇది మంచి ప్రభుత్వం' అనే మాట వినిపించింది.

● ఏప్రిల్ నుంచే పింఛన్ పెంపు

జిల్లా వ్యాప్తంగా 3,19,702 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచే అదనంగా రూ.వెయ్యి పెంచుతూ.. ప్రతినెలా ఒకటో తేదీనే సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేస్తున్నారు. వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ అసాధ్యమనే ఊహాగానాలను పటాపంచలు చేస్తూ.. గంటల వ్యవధిలోనే ప్రక్రియ పూర్తిచేస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వ విజయంగా ప్రజలు అభివర్ణిస్తున్నారు. అలానే పింఛన్ పెంపుదలపై దివ్యాంగుల్లో మరింత సంతోషం వ్యక్తమవుతోంది.

● ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ఆనందం

జిల్లాలో గత ఐదేళ్లు.. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా 15వ తేదీ వరకు వేతనాలు అందేవి కావు. వారి బ్యాంకు ఖాతాల సిబిల్ స్కోరు పడిపోయేది. ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగులు బయటకు చెప్పుకోలేని సమస్యలు అనుభవించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. జిల్లాలో ప్రతి నెలా ఒకటో తేదీ నాటికే వారి బ్యాంకు ఖాతాలో జీతం జమవుతోంది. దీంతో ఉద్యోగులు... వైసీపీని తిట్టుకుంటూ.. కూటమి ప్రభుత్వాన్ని కీర్తిస్తున్నారు. ఉద్యోగులను ఇబ్బంది పెడితే ఎలా ఉంటుందో జగన్ సర్కారుకు బాగా రుచిచూపించామని కొంతమంది బహిరంగంగానే పేర్కొంటున్నారు. అలానే నిరుద్యోగులు.. గత ఐదేళ్లు నిరాశకు గురయ్యారు. కేవలం వలంటీర్ల పోస్టులను, కొద్దిమందికే సచివాలయ కొలువులు తప్ప.. ఇతర ఉద్యోగాలేవీ భర్తీచేయక పోవడంతో నిరుద్యోగులు తీవ్ర వేదనకు గురయ్యారు. ముఖ్యంగా డీఎస్సీ కోసం జిల్లాలో సుమారు 20వేల మంది ఎదురుచూస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. వారంతా శిక్షణ తీసుకుంటూ.. ఉపాధ్యాయ కొలువుల కోసం సన్నద్ధమవుతున్నారు.

ఆకలి తీర్చిన అన్నక్యాంటీన్లు..

జిల్లాలో కూలీలు, చిరుద్యోగులు అధికం. వీరిలో చాలామంది అన్నక్యాంటీన్లలో భోజనం చేసి.. తమ పనులు చూసుకునేవారు. గత వైసీపీ పాలనలో అన్నక్యాంటీన్లు మూసేయడంతో వారంతా చాలా ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు.. ఇటీవల శ్రీకాకుళంలో రెండు చోట్ల.. పలాసలో ఒక అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. ప్రతిరోజు వేలాది మంది పేదలు కడుపునిండా భోజనం చేస్తున్నారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురంలో క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వంద రోజుల్లో పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లను పునరుద్ధరించడంపై జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● పంచాయతీల్లో ఒకేదఫా గ్రామసభలు

గత ఐదేళ్లు వైసీపీ సర్కారు పంచాయతీలను నిర్వీర్యం చేసేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే పంచాయతీలకు తొలివిడత ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. అలాగే ఒకేదఫా రికార్డు స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి.. ప్రజల నుంచి వినతులు స్వీకరించింది. అవసర మైన మౌలిక సదుపాయాలపై చర్యలు తీసుకుంది. ఇదిలా ఉండగా.. 2014-2019 మధ్య చేపట్టిన 'నీరు-చెట్టు' పథకం పనులకు సంబంధించిన బిల్లులను వైసీపీ నిలిపివేసింది. తాజాగా ఆ బిల్లులను కూటమి ప్ర భుత్వం విడుదల చేసింది. దీంతో ఇన్నాళ్లూ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఆనందం వ్యక్తమవు తోంది. అలాగే త్వర లో దీపావళి నాడు ఉచిత సిలెండర్ల ను ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

'ఎత్తిపోతల'కు నిధులు

వైసీపీ ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకాల మోటార్లు చోరీకి గురయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే... రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. ప్రభుత్వంతో మాట్లాడి జిల్లాలోని అన్ని ఎత్తిపోతల పథకాల మరమ్మతులు చేపట్టాల్సిందేనని అధికారులను ఆదేశించారు. ఆఘమేఘాలపై కోట్ల రూపాయల నిధులు విడుదల చేయించారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకాల మరమ్మతులు పూర్తయ్యాయి.



● పేదల ఆకలి తీరుస్తోంది

శ్రీకాకుళం నగరానికి జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది కార్మికులు, ప్రజలు వస్తుంటారు. అందరూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లలో భోజనం చేసి పనులకు వెళ్లేవారు. వైసీపీ వచ్చాక వారికి మధ్యాహ్న భోజనం ఆర్థిక భారమైంది. మళ్లీ ఇటీవల కూటమి ప్రభుత్వం శ్రీకాకుళంలో రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. రోజువేలాది మంది కడుపునిండా పేదలు భోజనం చేస్తున్నారు. వారు మనసారా సీఎం చంద్రబాబును ఆశీర్వదిస్తున్నారు.

- విభూది సూరిబాబు, జంగమ సాధికారిత డైరెక్టర్, శ్రీకాకుళం



● మహిళలకు ఆనందం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ దీపావళికి ఉచిత గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇది మహిళలకు ఎంతో ప్రయోజన కరం. ఈ దీపావళి.. మహిళలకు మరింత ఆనందంగా ఉండనుంది.

-కవ్వాడి సుశీల, శ్రీకాకుళం



● ఆశలు చిగురించాయి

నేను బీఈడీ పూర్తిచేశాను. కానీ ఐదేళ్ల నుంచి ఒక్క డీఎస్సీ లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో నా లాంటి ఎంతో మంది నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఎలా అయి నా సరే శ్రమించి.. ప్రభుత్వ కొలువు సాధించేలా శిక్షణ తీసుకుంటున్నాం.

-బోని నరసింహమూర్తి, నిరుద్యోగి, పాతపట్నం

జిల్లా రూపురేఖలు మారుస్తాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- రాజపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ప్రారంభం

కవిటి/ కంచిలి, సెప్టెంబరు 20: 'వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. జిల్లా రూపురేఖలు మారుస్తా'మని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన సందర్భంగా శుక్రవారం కవిటి మండలం రాజపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి చంద్రబాబు జవసత్వాలు నింపారు. వంద రోజుల్లో ప్రజలు ఆశించినదానికన్నా ఎక్కువే చేశాం. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వైసీపీ పాలన నుంచి విముక్తి కల్పించి.. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందజేశాం. పింఛన్ పెంపు, ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, 16వేల పోస్టులతో మెగా డీఎస్సీ తదితర వాటితో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉద్దానంలో కొబ్బరి పార్కు ఏర్పాటుకు కృషి చేస్తాం. వంశధార, నాగావళి, బాహుదా నదుల అనుసంధానానికి చర్యలు చేపడతాం. దివంగత నేత ఎర్రన్న నిర్మించిన ఉద్దానం తాగునీటి ప్రాజెక్టును గత పాలకులు నిర్వీర్యం చేశారు. ఇంటింటికీ తాగునీరు అందించేలా కృషి చేస్తాం. జిల్లాలో ఎయిర్‌పోర్టుతో పాటు మత్స్యకారుల ప్రయోజనం కోసం పోర్టుల నిర్మాణం సాగిస్తాం. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి టెక్కలి, సోంపేట, పలాసలో భూములు గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి కల్పిస్తామ'ని తెలిపారు.

రాష్ట్ర పండగగా.. కొత్తమ్మ జాతర

కోటబొమ్మాళి మండలంలో కొత్తమ్మ తల్లి జాతర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంటారు. కొత్తమ్మతల్లి జాతరను ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర పండగగా నిర్వహిస్తామని అచ్చెన్నాయుడు సార్వత్రిక ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఈ మేరకు కొత్తమ్మతల్లి జాతరను రాష్ట్ర పండగగా నిర్వహించేందుకు ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

నమ్మకాన్ని వమ్ముచేయం: మంత్రి అచ్చెన్న

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం రూ.14లక్షల కోట్లు అప్పులు చేసి.. రూ.4 లక్షల కోట్లు మాత్రమే లబ్ధిదారులకు పంచింది. రూ.10లక్షల కోట్లు నొక్కేసింది. జగన్ బటన్ నొక్కి రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టారు. రాష్ట్ర సచివాలయంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలన్నీ తనాఖా పెట్టేశారు. ఏ శాఖపై సమీక్ష చేస్తున్నా అప్పులే కనిపిస్తున్నాయి. అయినా భయపడే ప్రసక్తే లేదు. సమస్యల పరిష్కారంతోపాటు సంక్షేమ పథకాల అమలుతో ప్రజల మనసును కూటమి ప్రభుత్వం గెలుచుకుంది. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పాలన సాగిస్తాం. కూటమి పాలన జిల్లాకు స్వర్ణయుగం కానుంది. టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలన్నీ గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. జగన్ పర్యటనలతో.. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవారు. సమస్యలపై మాత్రం ఏనాడూ మాట్లాడలేదు. ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు రేయిపగలూ అండగా నిలిచిన సీఎం చంద్రబాబుకు.. నాటి సీఎం జగన్‌కు ఎంత వ్యత్యాసం ఉందో అర్థం చేసుకోవాలి. రాష్ట్రానికి పునర్ వైభవం తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదే. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో సహకారం అందజేస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.12వేల కోట్లు, అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు, రాష్ట్రంలో మూడు ఇండస్ట్రియల్ పార్కులు, కొబ్బరి అనుబంధ సంస్థల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయనుంది. వరి, జీడి, మామిడి పంటలకు మద్దతు ధర కల్పిస్తూ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు' అని తెలిపారు.

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ ఉద్దానంలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న కొబ్బరి రైతులను ఆదుకోవాలని కోరారు. 'ఉద్దానంలో గత తుఫాన్‌ల వలన ఏర్పడిన నష్టాన్ని పూడ్చేందుకు ప్రభుత్వం ఈ ప్రాంతంలో కొబ్బరి పార్కు ఏర్పాటు చేయాలి. మైనర్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి. కిడ్నీ సమస్యపై పరిశోధనలు వేగవంతం చేసి, రోగులను ఆదుకోవాలి. బెంతొఒరియాలకు కుల, నేటివిటీ ధ్రువపత్రాలు అందజేయాలి. కిడ్నీ బాధితులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తిచేసి.. ఇంటింటికీ తాగునీరందించాలి' అని కోరారు.

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ వలంటీర్లు లేకపోతే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరవని వైసీపీ నాయకులు ఊదరగొట్టారన్నారు. కానీ అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు ఒక్క రోజులోనే రాష్ట్రవ్యాప్తంగా పింఛన్‌ల పంపిణీని చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పలాస ఆర్డీవో భరత్‌నాయక్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పని ఇక్కడ.. వేతనం అక్కడ!

- ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో మతలబు
- ఇటు పంచాయతీ, అటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖ నుంచి బిల్లులకు యత్నం

(మెళియాపుట్టి)

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4 నుంచి 8 వరకూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించింది. వర్షాల నేపథ్యంలో ప్రతి పంచాయతీలోనూ జంగిల్ క్లియరెన్స్‌తో పాటు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పంచాయతీ ఖాతాలకు నిధులు కూడా జమచేశారు. కాగా.. వైసీపీకి చెందిన సర్పంచ్‌లే అధికంగా ఉండడం, కొంతమంది అధికారుల సహకారంతో వారు ఈ నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● మెళియాపుట్టి మండలం శోంపాపురంలో కొంతమంది ఉపాధిహామీ మస్తర్లు వేసి.. జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. మళ్లీ అదే పనికి పంచాయతీ నుంచి ఎన్ఎంఆర్ మస్తర్లు వేసి బిల్లులకు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు ఉండరో.. అక్కడ మాత్రమే 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. కాగా.. కొంతమంది సర్పంచ్‌లు మాత్రం ఈ నిధులు కాజేసేందుకు యత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఉపాధిహామీ పథకం నుంచి పనులు చేసిన వారికి డబ్బులు ఇచ్చి.. 15వ ఆర్థిక సంఘం నుంచి పం చాయతీ ఖాతాల్లో బిల్లులను పేర్లు మార్చేందుకు యత్నిస్తున్నారని సమాచారం. మెళియాపుట్టి మండలం లో కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు, అధికార పార్టీ నాయకులతో కలిసి బిల్లులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం నుంచి మస్తర్లు వేయడంతో బిల్లులు జనరేట్ అయినట్టు తెలుస్తోంది. దీనిపై జిల్లా అధికారులు దర్యాప్తు చేస్తే.. మరిన్ని వాస్తవాలు బయటకు వస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

● ఈ విషయమై మెళియాపుట్టి ఎంపీడీవో పి.చంద్రకుమారి వద్ద ప్రస్తావించగా.. పారిశుధ్య కార్యక్రమాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించాలని తెలిపారు. పనిచేసిన వారికి ఎన్ఎంఆర్ మస్తర్లు వేసి బిల్లులు పెట్టుకోవాలన్నారు. అలా కాకుండా ఉపాధిహామీ పథకంలో మస్తర్లు వేయడానికి అవకాశం లేదని తెలిపారు. ఎక్కడైనా అవకతవకలు జరిగి ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



గంగరాజుపురంలో పనులు చేస్తున్న ఉపాధి వేతనదారులు(ఫైల్)



మంత్రి లోకేష్‌ను కలిసిన రాష్ట్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్

కొలిక్కివచ్చిన గ్రానైట్ పర్మిట్ల జారీ

- 'విశ్వసముద్ర' నుంచి ఏఎంఆర్ సంస్థకు బదిలీ
- సోమవారం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో మైన్స్‌శాఖలో చలనం

(టెక్కలి)

నీలిరంగు గ్రానైట్ పరిశ్రమకు ఎట్టకేలకు పర్మిట్ల జారీ అంశం కొలిక్కివచ్చింది. 110 రోజులుగా పర్మిట్లు జారీ లేక కార్యకలాపాలు స్తంభించిపోయాయి. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో పాటు గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, తమిళనాడు మోన్యుమెంట్ ఫ్యాక్టరీస్ ప్రతినిధులు ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు. తాజాగా మంత్రి లోకేష్‌ను కలిసి సమస్య వివరించారు. దీంతో సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో పర్మిట్లు జారీకి మార్గం సుగమమైంది. 2025 మార్చి 31 వరకు నెలకు రూ.12.85 కోట్లకు టెండర్లు దక్కించుకున్న విశ్వసముద్ర సంస్థను రాష్ట్ర ప్రభుత్వం.. సాంకేతిక కారణాలను పక్కనపెట్టి ఎ.మహేశ్వరరెడ్డి(ఏఎంఆర్) సంస్థకు పర్మిట్ల జారీ బాధ్యత అప్పగించింది. ఆఫ్‌లైన్ పర్మిట్ల నుంచి ఆన్‌లైన్‌లోకి మార్చడం, సాంకేతిక సమస్యలు, సంబంధిత కాంట్రాక్టర్ పెండింగ్ బకాయిలు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏఎంఆర్ సంస్థ గుంటూరు జిల్లాలో గనులశాఖ పర్మిట్లు జారీ చేస్తోంది. ఇకనుంచి శ్రీకాకుళం జిల్లాతో పాటు చిత్తూరు, కడప, అనంతపురం, విజయనగరం జిల్లాల పర్మిట్ల జారీ బాధ్యత కూడా ఈ సంస్థకు అప్పగించారు. అందులో భాగంగా శుక్రవారం చిత్తూరు, విజయనగరం జిల్లాల్లో ఏఎంఆర్ సంస్థ తరఫున మైన్స్ అధికారులు పర్మిట్లు జారీచేశారు. శ్రీకాకుళంలో మాత్రం జారీకాకపోవడంతో గ్రానైట్ యజమానులు ఆందోళనకు గురయ్యారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ మంత్రి లోకేష్‌ను కలిసి సమస్యను వివరించడంతో సోమవారం నుంచి జిల్లాలో పర్మిట్ల జారీకి అవకాశం లభించింది. ఈ విషయమై గనులశాఖ డీడీ ఎస్‌కేవీ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా తమకు అధికారిక ఉత్తర్వులు రాలేదు.. కానీ సోమవారం నుంచి గ్రానైట్ పర్మిట్లు ఆన్‌లైన్‌లో జారీచేస్తామని తెలిపారు.

క్రెడిట్ కార్డు మోసాలపై అప్రమత్తం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 20: క్రెడిట్ కార్డు సంబంధిత మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'బ్యాంకు ఖాతాల సమాచారం, క్రెడిట్/డెబిట్ కార్డు నెంబరు, యూపీఐ పిన్, ఓటీపీ, సీవీవీ వంటి వివరాలు ఎవరితోనూ షేర్ చేయరాదు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి మీ క్రెడిట్ కార్డుపై చార్జెస్ పడతాయని, లేదంటే బ్లాక్ అవుతుందని, అలా జరగకుండా ఉండాలంటే మేము పంపే లింక్ ద్వారా వివరాలు నమోదు చేయాలని చెబుతుంటారు. అటువంటివారిపై జాగ్రత్తగా ఉండాలి. కెవైసీ అప్‌డేట్ కోసం థర్డ్‌పార్టీ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దు. ఎవరైనా సైబర్ నేరాలకు పాల్పడితే 1930కు ఫోన్ చేయాలి. లేదా సంబంధిత పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి' అని ఎస్పీ సూచించారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, సెప్టెంబరు 20: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'అభ్యర్థులు ఈ నెల 26లోగా ఐటీఐ డాట్ ఏపీ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో పేర్కొని రిజిస్ట్రేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒరిజనల్ సర్టిఫికెట్లను ఈ నెల 27 లోగా సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో పరిశీలన పూర్తిచేసుకోవాలి. ప్రభుత్వ ఐటీఐల్లో ఈ నెల 28న, ప్రైవేటు ఐటీఐల్లో 30న కౌన్సెలింగ్ ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న కళాశాలల్లో నిర్దేశించిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాల'ని సుధాకరరావు తెలిపారు.

శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ వరకే మెము రైళ్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 20: వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ-పూండి సెక్షన్‌లో భద్రత పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్లు ఈ నెల 26, 28 తేదీల్లో విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) -పలాస మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు.

● 25న సాయంత్రం 6.50 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరాల్సిన పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్(12897) రాత్రి 9.35గంటలకు(2.45 గంటలు), అలాగే 25, 27 తేదీల్లో మధ్యాహ్నం 1.40గంటలకు కేఎస్ఆర్ బెంగళూరులో బయలుదేరాల్సిన కేఎస్ఆర్ బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) సాయంత్రం 4.10 గంటలకు (2.30గంటలు) ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశామన్నారు.

● వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, గుణుపూర్ సెక్షన్‌లో తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం తనిఖీలు చేశారు. అమృత్ స్టేషన్ పథకం కింద నౌపడ స్టేషన్ వద్ద చేపట్టిన నిర్మాణ పనుల్లో భాగంగా 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన, ఇతర నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు.

పర్యావరణం - అధ్యయనం

దిక్సూచి DIKSUCHI

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హోలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్య శక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.

- **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.
- **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) **జీవ అనుఘటకాలు:** వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) **నిర్జీవ అనుఘటకాలు:** ఇవి మూడు రకాలు

1) **శీతోష్ణస్థితిపరమైనవి:** కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) **భౌతికపరమైనవి:** గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) **రసాయనికపరమైనవి:** సేంద్రీయపరమైన కార్బొహైడ్రేట్స్, ప్రోటీన్స్, లిపిడ్స్, నిరింద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూ మండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం బి) జలావరణం

సి) శిలావరణం డి) జీవావరణం

ఎ) వాతావరణం: ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుభాషలో అట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్ఫియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలి పొరను వాతావరణం అంటారు.

- భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర ఉంది.
- వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.
- వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.
- వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.
- గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.
- ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)
- **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ
- **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.

వాతావరణం లక్షణాలు

- దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒకచోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.
- ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.
- భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.
- వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.



వి.వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి

నవ్వుతూ జీవించడం నాన్న నేర్పించారు

నాగార్జున

మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'కింగ్ ఆఫ్ ద సిల్వర్ స్ర్కీన్ ఫిల్మ్ ఫెస్టివల్'ను శుక్రవారం అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు అక్కినేని నాగార్జున. హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డీ.సి. నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ సహకారంతో 31 నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. 'దేవదాసు' చిత్రంతో ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నవ్వుతూ జీవించడాన్ని నాన్న మాకు నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుని నవ్వుతుంటాం. ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్న శివేంద్ర సింగ్ దుంగార్పూర్‌కు ధన్యవాదాలు. వాళ్ల సెలెక్ట్ చేసిన చిత్రాల ప్రింట్స్ చక్కని క్వాలిటీతో ఉన్నాయి. నార్త్‌లో ఈ ఫెస్టివల్‌కు మంచి స్పందన వస్తోందని శివేంద్ర చెప్పారు. నాన్నగారి శత జయంతి రోజున పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక స్టాంప్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి నాన్నగారి సీనియర్ అభిమానులు హైదరాబాద్ వచ్చారు. వారికి కూడా దన్యవాదాలు' అని చెప్పారు. వెంకట్ అక్కినేని మాట్లాడుతూ 'నాన్నగారి శత జయంతి రోజున ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. బాపుగారు గీసిన ఫొటోతో స్టాంప్ రూపొందింది. ఈ రోజే స్టాంప్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసిన కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కృతజ్ఞతలు' అన్నారు. కేంద్రసమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ 'నవంబర్‌లో గోవాలో నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అక్కినేని చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొన్నారు.







చిరంజీవికి అక్కినేని అవార్డ్

మెగాస్టార్ చిరంజీవికి ఏయన్నార్ జాతీయ అవార్డ్ ఇవ్వనున్నట్లు హీరో నాగార్జున శుక్రవారం ప్రకటించారు. వచ్చే నెల 28న ఈ అవార్డ్‌ను ఆలిండియా మెగాస్టార్ అమితాబ్ చేతుల మీదుగా అందజేస్తామని ఆయన తెలిపారు. ఇకపై రెండేళ్లకు ఒకసారి ఈ అవార్డ్‌ను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయం చెప్పగానే చిరంజీవి ఎమోషనల్ అయ్యారనీ, ఇంతకంటే పెద్ద అవార్డ్ లేదన్నారని నాగార్జున చెప్పారు.లుగు చిత్ర పరిశ్రమలోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన చిత్ర ప్రముఖులకు తన పేరుతో జాతీయ అవార్డ్ ఇచ్చి సత్కరించాలని అక్కినేని తన పేరుతో జాతీయ అవార్డ్ ప్రారంభించి తొలిసారిగా 2006లో బాలీవుడ్ నటుడు దేవానంద్‌కు ఇచ్చారు. ఏటా క్రమం తప్పకుండా అవార్డులు ఇవ్వడానికి టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షుడిగా రూ.కోటి మూలధనంతో అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.






కె.బాలచందర్ స్త్రీలోలుడు

- గాయని సుచిత్ర

తమిళ దర్శక శిఖరం కె.బాలచందర్ ఓ స్త్రీలోలుడు అని గాయని, నటి సుచిత్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన జీవితకాలం కామవాంఛతో రగిలిపోయారంటూ ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'కె.బాలచందర్ చనిపోయేంత వరకు ఒక 'లస్ట్‌మేన్'గా ఉన్నారు. మహిళలను తప్పుడు దృష్టికోణంలోనే చూశారు. వారిపట్ల అసభ్యంగా నడుచుకున్నారు. ఆయన గురించి అనేక మందికి తెలుసు. నన్ను కూడా కొందరు ఫామ్‌హౌస్‌లకు రమ్మని పిలిచారు. కానీ, నేను వెళ్లలేదు' అని చెప్పారు. ఆమె ఆరోపణలను తమిళ చిత్ర దర్శకుల సంఘం, దక్షిణ భారత సినీ రచయితల సంఘం తీవ్రంగా ఖండించాయి. తమిళ చిత్రపరిశ్రమకు ఎంతో మేలు చేసి, అనేక అవార్డులు అందుకుని, అనేకమంది యువ దర్శకులకు మార్గనిర్దేశం చేసిన కె.బాలచందర్‌ను ఉద్దేశించి సుచిత్ర చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సౌత్ ఇండియన్ ఫిల్మ్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, కోలీవుడ్ సినీ దర్శకుడు సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ విడుదల చేసిన ప్రకటనలో, 'భౌతికంగా మన మధ్యలేని గొప్ప వ్యక్తి గురించి ఇలా మాట్లాడి, వారి కుటుంబ సభ్యులను మనోవేదనకు గురిచేయడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



మళ్లీ కెమెరా ముందుకు..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్ గతంలో తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. 'హరిహర వీరమల్లు' చిత్రం మొదటి భాగంలో మిగిలిన షూటింగ్ చేయడానికి సమయం కేటాయించారు. ఈ నెల 23 నుంచి విజయవాడలో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ సారథ్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించనున్నట్లు నిర్మాత దయాకరరావు చెప్పారు. ఇంతకు మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించడానికి దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాకు సమర్పకుడు.

ఓటుకు నోటు కేసు బదిలీకి సుప్రీం తిరస్కృతి!

- కేసు దర్యాప్తులో జోక్యం వద్దని రేవంత్‌కు ఆదేశం
- క్షమాపణలను అంగీకరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసినందున ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కేసు విచారణలో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డిని ఆదేశించింది. ఇక నుంచి కేసు విచారణను సీఎంకు నివేదించవద్దని ఏసీబీ డీజీని ఆదేశించింది. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది.

రేవంత్.. క్షమాపణలు స్వీకరిస్తున్నాం

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గతంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా మరోసారి ఆ అంశం ప్రస్తావన వచ్చింది. రేవంత్‌రెడ్డి ఒకసారి సోషల్ మీడియా వేదికగా, మరోసారి బహిరంగంగా రెండుసార్లు సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారని రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగబద్ధ హోదాల్లో ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని కోర్టు మరోసారి హితవు పలికింది. ప్రజాస్వామ్యంలోని 3 కీలక వ్యవస్థలు తమ పరిధిలోని రాజ్యాంగ విధులను నిర్వర్తించాలని సూచించింది.

టిడ్కో సముదాయాలు ఇక 'ఎన్టీఆర్ నగర్'లు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల కాలనీలకు ఇక నుంచి పీఎంఏవై-ఎన్టీఆర్ నగరాలుగా పేరు మార్చనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత వాటికి వైఎస్ఆర్ జగనన్న నగరాలుగా పేరు పెడుతూ అప్పట్లో మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ కాలనీలకు ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చారు.

చంచల్‌గూడ జైలుకు జానీ మాస్టర్

- రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- దురుద్దేశంతోనే బాలికను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడు
- చేరిన నెలలోపే ముంబైకి తీసుకెళ్లి అత్యాచారం
- రిమాండ్ రిపోర్టులో వెల్లడి



పోలీసు వాహనంలో జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్/నార్సింగి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అరెస్టయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా(42)ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆయన్ను గోవా నుంచి నగరానికి తీసుకొచ్చిన సైబరాబాద్ ఎస్‌వోటీ, నార్సింగి పోలీసులు.. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబర్ 3 వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. అనంతరం జానీ మాస్టర్‌ను అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ తీసుకెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు.. చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు విస్తుపోయే వెల్లడించారు. జానీమాస్టర్ దురుద్దేశంతోనే బాధితురాలిని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ప్రముఖ డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం రావడంతో 2017లో నగరానికి వచ్చిందని.. తర్వాత జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరిందని తెలిపారు. 2019, డిసెంబర్ 15 నుంచి జానీ మాస్టర్ వద్దే పనిచేస్తూ అల్కాపురికాలనీలో ఉంటోందని.. ఆ సమయంలో ఇద్దరూ ఒక సూపర్ హిట్ సినిమాకు పనిచేశారని పేర్కొన్నారు. ఆ సినిమా పని నిమిత్తం 2020 జనవరి 10న (అంటే చేరిన నెలరోజుల్లోపే) జానీ మాస్టర్, బాధితురాలు, మరో ఇద్దరు సహాయకులు ముంబై వెళ్లారని.. ఆ రోజు రాత్రి 12 గంటలకు బాధితురాలిని ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు తీసుకొని తన గదికి రావాలని ఆదేశించిన మాస్టర్.. ఆమె గదిలోకి రాగానే గడియ పెట్టి అత్యాచారం చేశాడని.. అప్పటికీ బాలిక వయసు 16 ఏళ్లని తెలిపారు. అందుకే జానీమాస్టర్‌పై పోక్సో చట్టం కింద కూడా కేసు పెట్టినట్టు వెల్లడించారు. హోటల్ గదిలో జరిగినదాని గురించి ఎవరికైనా చెప్తే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమలోనే లేకుండా చేస్తానంటూ బాధితురాలిని జానీమాస్టర్ బెదిరించినట్టు తెలిపారు. భయపడిన బాధితురాలు మిన్నకుండా ఉండిపోయిందన్నారు. చెప్పినట్లు వినకుంటే షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందూ అసభ్యకరంగా మాట్లాడి అవమానించేవాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ ఆమెపై ఒత్తిడి కూడా తెచ్చేవాడని వెల్లడించారు. రోజురోజుకూ అతని వేధింపులు ఎక్కువ అవడంతో ఆమె సొంతగా పనిచేయడం ప్రారంభించిందని.. దీంతో ఒకరోజు జానీమాస్టర్, ఆయన భార్య ఆమె ఇంటికి వెళ్లారని, బాధితురాలి చెంపపై మాస్టర్ భార్య కొట్టారని.. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలిపై దాడికి యత్నించారని, ఏదో పార్సిల్ పంపి భయపెట్టాలని చూశారని పోలీసులు పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అకృత్యాల గురించి బాధితురాలు.. జానీ మాస్టర్ వద్ద పనిచేస్తున్న మరో అసిస్టెంట్‌కు చెప్పుకొందని, అతని సూచన మేరకే పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యులు విధుల్లో చేరాలి: కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సేవలు నిత్యావసర, అత్యవసరమైనవి అయినందున పీహెచ్‌సీ వైద్యులంతా వెంటనే విధుల్లో చేరాలని ఆరోగ్యశాఖ కమిషనర్ పి.హరికిరణ్ కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యులకు, డా.యూనస్‌కు ఆయన లేఖ రాశారు. ఇన్‌సర్వీస్ రిజర్వేషన్‌కు సంబంధించి పీహెచ్‌సీ డాక్టర్లు తమ ఆందోళనలను తిరిగి ప్రారంభిస్తారంటూ పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.యూనస్ మీర్ ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు లేఖ అందించారు. దానిపై స్పందించిన ఆరోగ్య శాఖ కమిషనర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని తిరిగి లేఖ రాశారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు తన లేఖలో వాడిన భాష, ఆందోళన కార్యక్రమాల కొనసాగింపు ప్రతిపాదన ఈనెల 18న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు.

ఒకేరోజు 1.03కోట్ల పుస్తకాల పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను ఒకేరోజు పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రెండో సెమిస్టర్‌కు సంబంధించిన 1.03కోట్ల పుస్తకాలను ఈనెల 30న పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే మండల పాయింట్లకు పుస్తకాలు చేరుకున్నాయని, 28లోగా పాఠశాలలకు చేరుకుంటాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. 30న పంపిణీ ఈ ప్రక్రియను ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు.

నాపై పరువు నష్టం కేసు కొట్టివేయండి

- హైకోర్టుకు జగన్... ఎల్లుండి విచారణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో మంత్రి నారాయణ తనపై వేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ వద్ద విచారణకు రానుంది. రాజధాని భూముల వ్యవహారంలో తన పరువుకు భంగం కలిగించేలా వార్త ప్రచురించారని పేర్కొంటూ 2018లో మంత్రి నారాయణ, విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో జగన్మోహన్‌రెడ్డి, తదితరులపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో కోర్టు పలుసార్లు సమన్లు జారీ చేసినా జగన్ వాటిని అందుకోలేదు. పాస్‌పోర్టు పునరుద్ధరణ నిమిత్తం ఎన్‌వోసీ కోసం ఇటీవల ఆయన విజయవాడ కోర్టును ఆశ్రయించగా, ఎన్‌వోసీ జారీకి షరతులు విధించింది. ఈ ఉత్తర్వులను హైకోర్టు కూడా సమర్థించింది. పరువునష్టం కేసులో ప్రజాప్రతినిధుల కోర్టు జగన్‌కు తాజాగా సమన్లు ఇచ్చింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. దీంతో పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించారు.

విద్యార్థినులకు డైట్ చార్జీల పెంపు

కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల, కలికిరి, కంచికర్ల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థినులకు డైట్ చార్జీలు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రూ.1,400 నుంచి రూ.1,600కు పెంచింది.

నా ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసులో హైకోర్టుకు బాధిత మహిళ వెల్లడి
- కేసు కొట్టేయాలంటూ అఫిడవిట్.. తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు
- ఈ నెల 25న నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటు చేసుకొంది. ఎమ్మెల్యే లైంగికంగా వేధించాడని కేసు పెట్టిన మహిళ స్వయంగా హైకోర్టు ముందు హాజరై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తాను చేసిన ఆరోపణలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని న్యాయస్థానానికి నివేదించారు. ఈ మేరకు న్యాయవాదితో నోటరీ చేసిన అఫిడవిట్ దాఖలు చేశామని ఆమె తరఫు న్యాయవాది జితేందర్ కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. న్యాయస్థానం సైతం ఫిర్యాదుదారును పిలిచి మాట్లాడగా వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ వేశానని, ఆదిమూలంపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈ నెల 25న తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. అప్పటివరకు ఆదిమూలంపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనపై పలుమార్లు లైంగికదాడి చేసి, అత్యాచారానికి పాల్పడ్డారంటూ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఈ నెల 5న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ నుంచి సస్పెండ్ అయిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ఫిర్యాదుదారు నేరుగా కోర్టుకు హాజరయ్యారు. ఆదిమూలం తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ.... 'పిటిషనర్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనపై కేసు నమోదులో పోలీసులు చట్ట నిబంధనలు అనుసరించలేదు. మహిళా పోలీసు అధికారిణి కేసు నమోదు చేయాల్సి ఉండగా, పురుష అధికారి కేసు పెట్టారు. ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవు. జూలై, ఆగస్టు నెలల్లో ఘటన జరిగితే సెప్టెంబరు 5న ఫిర్యాదు చేశారు. మూడో వ్యక్తి చేసిన ఒత్తిడితోనే మహిళ కేసు పెట్టింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలి' అని కోరారు. బాధిత మహిళ తరఫున న్యాయవాది జితేందర్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని బాధితురాలు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. దానిని పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలని కోరారు.

ముందస్తు బెయిలు మంజూరు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన కాంతిరాణా తాతా

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి కాంతిరాణా తాతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ముందు విచారణకు రానుంది. ఆ పిటిషన్‌లో.. 'తన ఆధార్ కార్డు, ఇతర డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారని, తప్పుడు క్రిమినల్ కేసు పెట్టి పోలీసుల చేత అరెస్ట్ చేయించి వేధించాడని కుక్కల విద్యాసాగర్‌పై సినీనటి కాదంబరి జత్వాని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా కుక్కల విద్యాసాగర్, ఇతరులని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు తనను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. ఫిర్యాదులో నాపై నిర్దిష్టంగా ఎలాంటి ఆరోపణలు లేవు. జత్వానిపై కేసు, ఇంటిలో సోదాలు, అరెస్టు వ్యవహారంలో చట్ట నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఇప్పటికే నన్ను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. వ్యాజ్యం తేలేవరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని కాంతిరాణా తాతా కోరారు.

వామ్మో.. కుక్కలు!


టెక్కలిలో వీధి కుక్కల సంచారం

● గుంపులుగా తిరుగుతూ.. భయభ్రాంతులకు గురిచేస్తున్న శునకాలు ● ఆసుపత్రుల్లో చేరుతున్న బాధితులు

● గడచిన ఆదివారం మెళియాపుట్టిలో వీధిలో ఆడుకుంటున్న సారధి, శ్రీభరత్, హర్షవర్ధన్, నేతాజీ, గౌతమ్ అనే పదేళ్లలోపు బాలుర పై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. వెంటనే వారికి మెళియాపుట్టి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించారు.

● మూడు రోజుల కిందట పొందూరులో ఒకేరోజు 27మంది కుక్కకాటుకు గాయపడి చికిత్స పొందారు.

● పలాస-కాశీబుగ్గ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన 12 ఏళ్ల హరిఅక్షిత్‌పండాపై గత నెల 17న కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.

● టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో ఓ ద్విచక్రవాహనానికి సంబంధించిన సీటు పూర్తిగా కుక్కలు కొరికేశాయి.

(టెక్కలి)

..ఇలా జిల్లాలో ఏ గ్రామంలో చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తూ కనిపిస్తున్నాయి.. ఎదురుగా వచ్చే బాటసారులు, ద్విచక్ర వాహనచోదకులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో కుక్కలను చూడగానే భయభ్రాంతులకు గురికావాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలోనే గుంపులుగా తిరుగుతుండడంతో వాటిని చూడగానే ఆందోళన చెంది ఒక్కో సారి సెల్ఫ్ యాక్సిడెంట్లకు గురైన సందర్భాలు లేకపోలేదు.. అలాగే కుక్కలు ఎక్కువగా చిన్నారులను టార్గెట్ చేస్తుండడంతో ఇళ్లనుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకు సుమారు 1,744 మంది కుక్కల కాటుకు గురయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది వైద్య ఆరోగ్యశాఖ లెక్క. ఇవి కాకుండా బయటకు రాని కేసులు అనేకం ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. మరికొందరు కుక్కకాటుకు గురై ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఏఆర్‌వీ ఇంజక్షన్లు వేయించుకోవడం వల్ల వారి వివరాలు నమోదు కావడం లేదు. ఇదిలా ఉండగా పశు సంవర్థక శాఖ వద్ద ఉన్న వివరాల మేరకు జిల్లాలో 40 వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి నరసన్నపేట ఏరియా ఆసుపత్రి, 13 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా జనరల్ ఆసుపత్రి (రిమ్స్)లో ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేస్తున్నా కుక్క కాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

కుటుంబ నియంత్రణ చేపడుతున్నా..

కుక్కలు నియంత్రణకు ఒక కార్పొరేషన్, మూడు మునిసిపాలిటీలు, 11 మేజర్‌పంచాయతీల్లో అప్పుడప్పుడు కుటుంబ నియంత్రణకు చర్యలు చేపడుతున్నా మిగిలిన 913 పంచాయతీల్లో అటు వంటి చర్యలు కానరావడం లేదు. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో పశు సంవర్థక శాఖ, ఎన్జీవో సంయుక్తంగా కుటుంబ నియంత్రణ (స్టెబులైజేషన్) చేపడుతున్నాయి. అయితే ఇక్కడ కూడా కుక్కల సంఖ్య నిత్యం పెరుగుతూనే ఉండడంతో నగర వాసుల్లోనూ ఆందోళన కలుగుతోంది. అయితే మిగిలిన పంచాయతీల్లో ఆర్థిక సమస్యతో కుక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు లేవు. కొన్ని గ్రామాల్లో కుక్కల సంఖ్య నియంత్రణకు నిధులు వెచ్చిస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కానరావడం లేదన్నది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాలు, పట్టణ వాసులు కోరుతున్నారు.


జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

కుక్కల స్వైరవిహారంతో ఐదుగురికి గాయాలు..

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీలో గురు, శుక్రవారాల్లో అక్కపువీధి, తెలుకలవీధి, కంచ్రవీధి, కోదండరామవీధి ప్రాంతాల్లో కుక్కల దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కుక్కల దాడిలో గాయపడిన బి.బాలకృష్ణ, హేమసుందర్, శరత్, దుర్గాప్రసాద్, వివేకానంద బెహరా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందారు. రెండురోజుల కిందట కూడా సాయి అనే బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. నిత్యం కుక్కలు స్వైరవిహారం చేస్తూ పలువుర్ని గాయపరచడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

అందుబాటులో ఏఆర్‌వీ



కుక్కకాటుకు సంబంధించి అవసరమైన ఏఆర్‌వీలు అన్ని ఆసుత్రుల్లో సిద్ధంగా ఉన్నాయి. ఎక్కడైనా ఏఆర్‌వీలు తగ్గాయంటే ఇండెంట్ పెట్టిన వెంటనే పంపిస్తున్నాం. పీహెచ్‌సీల్లోనూ పూర్తిస్థాయిలో ఏఆర్‌వీలు అందుబాటులో ఉంచాం. కుక్కకాటు బాధితులకు అవసరమైన సేవలను అందిస్తున్నాం.

-డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంఅండ్‌హెచ్‌వో, శ్రీకాకుళం

40 వేలకు పైగా వీధికుక్కలు..



జిల్లాలో 40 వేలకు పైగా వీధికుక్కలు ఉన్నట్లు గుర్తించాం. శ్రీకాకుళం నగరంలో ఎన్‌జీవో ఆర్గనైజేషన్ ద్వారా స్టెబులైజేషన్ చేపడుతున్నాం. కుక్కలకు ఈ కార్యక్రమం చేసినప్పుడు కొన్ని మందులను పశుసంవర్థకశాఖ భరిస్తుండగా, మరికొన్ని ఖర్చులు పంచాయతీలు భరించాల్సి ఉంది.

-డాక్టర్ జయరాజ్, డీడీ, పశుసంవర్థకశాఖ

పార్టీకి నష్టం జరిగితే సహించను

● ఎమ్మెల్సీ దువ్వాడకు స్పష్టం చేసిన వైసీపీ అధినేత

టెక్కలి: పార్టీకి డ్యామేజీ జరిగితే సహించేది లేదు.. సరిదిద్దుకోకుంటే సస్పెండ్ చేస్తానంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు స్పష్టం చేశారు. దువ్వాడ శ్రీనివాస్‌ను అమితంగా ఇష్టపడే జగన్ పార్టీ నేతలు ఆయనపై చేసిన ఫిర్యాదులతో చిర్రెత్తిపోయారు. గురువారం తాడేపల్లి నివాసంలో జిల్లా వైసీపీ నాయకులతో జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వాడ ఫ్యామిలీ ఎపిసోడ్ మూలంగా జిల్లాలో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి జగన్‌కు వివరించారు. ఆమెతో పాటు ఇటీవల టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన పేడాడ తిలక్ కూడా శ్రుతి పలికారు. దివ్వల మాధురి ఇటీవల మాట్లాడుతూ.. టెక్కలి ఇన్‌చార్జి పదవి మేము వేసిన భిక్ష.. ముష్టి అని మాట్లాడిన వీడియో అంశం, అలాగే గురువారం తిలక్ రూ.50 కోట్ల అవినీతిపరుడని, వేరొకరి పేరుతో సోషల్ మీడియాలో విడుదలైన మేటర్ వెనుక మాధురి హస్తముందని తిలక్ జగన్‌కు వివరించారు. ఆమెకు చెప్పు.. ఇకపై ఇలాంటివి జరగకుండా చూడు అని అనగా ఆమె ఎవరి మాట వినదని శ్రీనివాస్ అనడంతో జగన్ మరింత అసహనం వ్యక్తంచేశారు. నీవు ఎవరితో ఉంటావో స్పష్టం చేయు.. వారిని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత నీదేనంటూ స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెట్టకుంటే పరిణామాలు మారుతాయని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సి వస్తుందని జగన్ చెప్పుకొచ్చారు. 2029లో తాను ముఖ్యమంత్రిగా ఉండాలంటే టెక్కలి అసెంబ్లీ బరి నుంచి పేడాడ తిలక్, పార్లమెంట్ బరి నుంచి తమ్మినేని సీతారాం పోటీ చేస్తారని, వారిని గెలిపించుకుని వస్తేనే.. నీ ఎమ్మెల్సీ పదవిపై మాట్లాడుకుందాం అంటూ దువ్వాడకు కరాఖండిగా స్పష్టం చేశారు. ఈ ఘటనతో వైసీపీ నాయకులు తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణదాస్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, పిరియా విజయ, నర్తు రామారావు నిశ్చేష్టులయ్యారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి మంత్రి అచ్చెన్న కృషి

కోటబొమ్మాళి: ఎంతోకాలంగా మా ప్రాంతానికి విద్యుత్ సమస్య వేధిస్తుండేదని, దీనికి మంత్రి అచ్చెన్నాయుడు కృషితో పరిష్కారమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మాజీ డైరెక్టర్ కర్రి అప్పారావు అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. గతం నుంచి సంతబొమ్మాళి ఫీడర్ నుంచి లఖందిడ్డి, యలమంచిలి, గంగారాం, సంతబొమ్మాళి మండలం తోటాడ కు విద్యుత్ సౌకర్యం ఉండేదని, దీనివల్ల తరచూ విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడేవారమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన కోటబొమ్మాళి నుంచి 12 కేవీ లైన్ ఏర్పాటు పనులు చురుగ్గా చేపడుతున్నారన్నారు. త్వరితగతిన సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. దీనికి కృషి చేసిన మంత్రి అచ్చెన్న రుణం తీర్చుకోలేనిదన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పంచాయతీల టీడీపీ నేతలు ఇరఘట్టపు శివరాం, కర్రి చెల్లయ్య, లండ వసంత్, రోణంకి లీలామోహన్ ఉన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

నందిగాం: కవిటిఅగ్రహారంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార ప్రదర్శన, ర్యాలీ, గర్భిణులకు సీమంతాలు చేపట్టారు. పౌష్టికాహార ఆవశ్యకతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై. శారదాబాయి అవగాహన కల్పించారు. గ్రామపెద్దలు బి.గున్నయ్య, బి.బారికి, పలువురు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మురంగా వాహనాల తనిఖీ

కొత్తూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్ఐ అహ్మద్ పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాల రహదారిలో మెట్టూరులో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. పలు వాహనాల పత్రాలను తనిఖీ చేశారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

పాతపట్నం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తికి 14 రోజుల రిమాండ్‌ను కోర్టు విధించినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. కొరసవాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.16,560 విలువచేసే మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 93 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని పాతపట్నం కోర్టులో హాజరుపరచగా శుక్రవారం రిమాండ్ విధించారన్నారు.

మాడ వీధుల అభివృద్ధికి చర్యలు

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయం మాడవీధుల అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈ సత్యంనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పనులకు సంబంధించి మార్కింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల నుంచి టూరిజం శాఖ ఈ నిధులు మంజూరు చేసిందన్నారు. కార్తీక మాసం నాటికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ టి.సతీష్‌కుమార్, మాజీ సర్పంచ్ తర్ర బలరాం పాల్గొన్నారు.

సాగు సమస్యలను పరిష్కరించండి



పాతపట్నం: వ్యవసాయంలో సాగు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ జె.ఢిల్లీశ్వర రావును కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారన్నారు. రాయితీపై యంత్రాలను అందించాలని కోరారు.

లింగాలవలసలో స్కూల్ గేమ్స్ ఎంపికలు

టెక్కలి: లింగాలవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్‌గేమ్స్ గ్రిగ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచ్ సంపతిరావు లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు డి.తులసీరావు, చిన్నారావు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. సీనియర్ గర్ల్స్ విభాగంలో భీంపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రథమ, చాకిపల్లి జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. బాలుర విభాగంలో టెక్కలి ప్రథమ, చాకిపల్లి జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో హెచ్ఎం వైకుంఠ రావు, క్రీడా ఇన్‌చార్జ్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

పలాస: పలాస నియోజకవర్గ క్రీడాకారుల పోటీలను శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను బాలబాలికలకు నిర్వహించారు. అనంతరం వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.దాశరధి, ఎంఈవో శ్రీనివాసరావు, రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.తవిటయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన గ్రిగ్స్ పోటీలు

పాతపట్నం: కొరసవాడ జడ్పీహైస్కూల్ ఆవరణలో శుక్రవారం మండలస్థాయి గ్రిగ్స్ పోటీలను ఎంఈవో-2 తిరుమలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పోటీలను హెచ్ఎం బి.సింహాచలం, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు మడ్డు తాతయ్య తదితరులు పర్యవేక్షించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

పలాస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకాంలో ట్యాక్సేషన్ స్పెషలైజేషన్ ఉన్న వారు అర్హులని, తమ దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోగా ఒరిజినల్ పత్రాలతో కళాశాల పనిచేయు వేళల్లో హాజరు కావాలని కోరారు.

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సంతబొమ్మాళి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సవలాపురపు కృష్ణవేణి, పోతనపల్లి కృష్ణవేణి డిమాండ్ చేశారు. ఈనెల 27న శ్రీకాకుళంలో జరగనున్న సంఘం జిల్లా 7వ మహాసభలను విజయవంతం చేయాలని శుక్రవారం వడ్డితాండ్రలో ప్రచారం చేశారు. మహిళల మిస్సింగ్, ఇమ్మోరల్ ట్రాఫికింగ్ అడ్డుకొనేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి సత్వర న్యాయం అందించాలని కోరారు.

మోడల్ స్కూల్ మైదానం పనుల పరిశీలన

ఈదులవలస(పోలాకి): ఈదులవలస మోడల్ స్కూల్ మైదానం పనులను జిల్లా పరిశీలకుడు సీహెచ్ సుధాకరరావు శుక్రవారం పరిశీలించారు. మైదానం చదునుకు సుమారు రూ.8లక్షల వ్యయం అవుతుందని పాఠశాల పీడీ ఎం.నీలం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ బి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

టెక్కలి: విద్యార్థులపై ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ ఎ.విజయ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహకరించండి

హిరమండలం: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ అన్నారు. శుక్రవారం గొట్ట గ్రామంలో మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలు, 1930 వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ సీజ్

నరసన్నపేట: స్థానిక జమ్ము జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంత నుంచి విజయనగరం జిల్లా అలమండకు వ్యాన్‌లో తరలిస్తున్న 31 ఆవులను పట్టుకుని కొత్తవలస గోశాలకు తరలించినట్లు తెలిపారు.

24న జరగనున్న సభను విజయవంతం చేయండి

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేటలో ఈనెల 24న నిర్వహించనున్న ఇది మంచి ప్రభుత్వం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గౌతుశిరీష అన్నారు. శుక్రవారం పలాస కార్యాలయంలో వజ్రపుకొత్తూరు నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సభకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు వస్తున్నారని, క్యాడర్, ప్రజలు తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సూరాడ మోహనరావు, గొరకల వసంతరావు, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గోవింద పాపారావు, గుల్ల చిన్నారావు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 16 వినతులు


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఆశ కార్యకర్త, సీఐటీయూ నాయకులు

పలాస: కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారవేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలపై వినతి పత్రాలను అందించారు. మొత్తం 16 వినతులు రాగా వీటిలో సివిల్ 5, మిస్సింగ్ కేసు-1, పాత కేసులు- 3, ఇతర సమస్యలపై నాలుగు వినతులొచ్చాయి. తనకు ప్రాణహాని ఉందని పలాస మండలం కిష్టుపురానికి చెందిన ఆశ కార్యకర్త బి.కృష్ణవేణి ఎస్పీకి విన్నవించారు. అదే గ్రామంలో అధికారపార్టీ నాయకులు తమపై దాడి చేశారని, ఎప్పటికప్పుడు గొడవలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వెంట సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ● **నరసన్నపేట:** స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం రాత్రి పరిశీలించారు. స్టేషన్ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పట్టణంలోని గొడగల వీధికి చెందిన వృద్ధురాలిని ఎస్పీ పలకరించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తన కుమార్తె సరిగా చూడడం లేదని ఆమె ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస రావు ఎస్ఐ దుర్గాప్రసాద్ ఉన్నారు.

'మెట్‌కోర్' రూ.4 కోట్ల బకాయిలు

● పవర్ కట్ చేసిన ట్రాన్స్‌కో అధికారులు

టెక్కలి: రావివలసలో రెండు నెలలుగా లాకౌట్‌తో మూతపడిన మెట్‌కోర్ ఎల్లాయిస్ పరిశ్రమ మూడు నెలలకు సంబంధించి విద్యుత్ శాఖకు 4,29,76,137 బకాయిలుండడంతో శుక్రవారం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను కట్ చేశారు. పరిశ్రమ రన్నింగ్ ఉన్న సమయంలో బకాయిల వసూలుపై నిర్లక్ష్యం వహించిన విద్యుత్ అధికారులు పరిశ్రమ మూతపడిన తరువాత సరఫరా నిలిపివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా వందో, రెండొందలో బకాయి ఉండే సామాన్యులను ఇబ్బందులు పెట్టే ట్రాన్స్‌కో అధికారులు ఇలా కోట్లలో బకాయిలున్న పరిశ్రమలపై సవతితల్లిప్రేమ చూపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏపీఈపీఈడీసీ ఎల్ టెక్కలి డివిజన్ ఈఈ జి.శంకరరావు వద్ద ప్రస్తావించగా జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి రూ.4.29 కోట్లు పైచిలుక విద్యుత్ బిల్లులు బకాయి ఉండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం


ఎమ్మెల్యే శిరీషకు చెక్కును అందిస్తున్న విద్యార్థులు

పలాస: విజయవాడ వరద బాధితుల సహాయం కోసం మదర్‌థెరిసా విద్యాలయం విద్యార్థులు రూ.లక్ష విరాళం అందించారు. చిల్లర ఖర్చుల కోసం తల్లిదండ్రులు ఇచ్చిన నగదుతో పాటు విరాళాలు సేకరించి, ఈ మొత్తం చెక్కును శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషకు అందజేశారు. కార్యక్రమంలో విద్యాలయం చైర్మన్, టీడీపీ నాయకురాలు వజ్జ గంగాభవాని, డీస్ ప్రసాద్, జోగారావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపండి

టెక్కలి: పాత జాతీయ రహదారి పుట్‌పాత్‌పై తోపుడు బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, అయితే పంచాయతీ అధికారులు అక్కడి నుంచి వెళ్లగొట్టారని, దీని వల్ల తామంతా ఉపాధి కోల్పోయామని తోపుడుబండ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపటారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసు కుంటున్నామని, ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. మంత్రి అచ్చెన్నాయుడును కలిసి సమస్యను విన్నవించామని, పంచాయతీ అధికారులు సహకరించాలనికోరారు. కార్యక్రమంలో చిరు వ్యాపారులు ఉర్జాన మాధవరావు, చిన్నమ్మడు, నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.

చేపల వేటలో మెలకువలు తెలుసుకోవాలి

హరిపురం: ఏజెన్సీలో రిజర్వాయర్‌లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు చేపల వేటలో మెలకువలు తెలుసుకోవాలని ఆక్వా శాస్త్రవేత్త కె.బాలకృష్ణ అన్నారు. శుక్రవారం బుడార్సింగి పంచాయతీ పద్మాపురం కాలనీ గ్రామంలో శుక్రవారం గిరిజనులకు బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 30 మంది కార్మికులకు బయో సెక్యూరిటీ కిట్‌లు (రెయిన్‌కోట్, లైఫ్ జాకెట్, టోపీ, బ్యాక్ ప్యాక్)లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు ఎస్.బాలాజీ, పి.సునీల్‌కుమార్, సాయికిశోర్, సర్పంచ్ సురేష్ పాణిగ్రాహి, ఎంపీటీసీ లోకేశ్వరరావు, పలువురు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక లైన్‌మన్ ఆత్మహత్య


శంకరరావు (ఫైల్)

నందిగాం: బెల్లుకోలకు చెందిన లైన్‌మన్ మొగిలిపాటి శంకరరావు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శంకరరావు రధ జనబొడ్డపాడు సచివాలయంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శంకరరావు అప్పులపాలై గత కొన్నిరోజులుగా మన స్తాపానికి గురి కావడంతో పాటు మరోవైపు కుమార్తె మృతి చెందిన బాధతో మరింత కుంగిపోయి ఇంట్లోని వంటగదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా శంకర రావుకు భార్య అనూష, కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. సోదరుడు పాపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షేక్‌మహ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం



కంచిలి: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం గుర్తించినట్టు జీఆర్‌పీ హెచ్‌సీ హరినాథ్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు 9440627567 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

మద్యం మత్తులో హల్‌చల్


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కేశవరావు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని కోరాడ వీధి సమీపంలో టిఫిన్ దుకాణం వద్ద ఓ వ్యక్తి మద్యం మత్తులో హల్‌చల్ చేసి అక్కడే ఉన్న ఇద్దరు విద్యార్థులపై దాడికి దిగాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలవీధి సమీపంలోని కోరాడవీధి వద్ద గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో కోల కేశవరావు అనే వ్యక్తి మద్యం మత్తులో టిఫిన్ చేసేందుకు దుకాణం వద్దకు వచ్చాడు. అదే సమయంలో ఇద్దరు విద్యార్థులు అక్కడ టిఫిన్ చేస్తున్నారు. కేశవరావు ఆ విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించాడు. ఇది తగదని తమని విడిచి పెడితే ఇంటికి వెళ్లిపోతామని ఆ విద్యార్థులు ప్రాధేయపడ్డారు. మద్యం మత్తులో ఉన్న కేశవరావు ఈ మాటలేవీ వినిపించుకోకుండా విద్యార్థులపై దాడికి ఎగబడ్డాడు. ఈ క్రమంలో విద్యార్థుల దుస్తులు చింపేసి కొట్టడంతో చేసేదిలేక ఆ విద్యార్థులు ఎదురుతిరిగారు. ఈ ఘటనలో కేశవరావుకు గాయాలు కాగా, విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న వన్ టౌన్ పోలీసులకు జరిగిన విషయాన్ని దాచిపెట్టి రాజీ అయిపోతామని కేశవరావు తెలిపాడు. దీంతో గొడవ సద్దుమణిగిందనుకున్న పోలీసులు.. శుక్రవారం కేశవరావు ఎంఎల్‌సీ రిపోర్టును చూసి ఆశ్చర్యపోయారు. మద్యంమత్తులో ఉన్న కేశవరావు రిమ్స్ ఆసుపత్రిలో చేరి, తనపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారంటూ ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంఎల్‌సీ రిపోర్టు ఆధారంగా ఎస్‌ఐ హరికృష్ణ విచారణ చేపట్టారు.

కుక్కల దాడిలో ఆవు మృతి

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 23వ వార్డు లక్ష్ముడుపేటలో కుక్కల దాడిలో గాయపడిన ఆవు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే లక్ష్ముడుపేటలో రెండు రోజుల కిందట పాడి రైతు పైడి హరినారాయణకు చెందిన ఆవుపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గాయపడిన ఆవు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. గతంలో కూడా ఇదే రైతుకు చెందిన రెండు ఆవులు కుక్కల దాడిలో మృతి చెందాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో కుక్కలు అధిక సంఖ్యలో ఉన్నాయని, దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు


ఎస్పీని కలిసిన డీఎస్పీ రాజశేఖర్

శ్రీకాకుళం క్రైం: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు పోలీసు అధికారులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బి.రాజశేఖర్‌తో పాటు టూటౌన్ ఎస్‌ఐ ఆర్.సంతోష్‌కుమార్, మెళియాపుట్టి ఎస్‌ఐ పి.రమేష్‌బాబు కలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వంతో వెలుగులు

కవిటి/కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కవిటి మండలం రాజపురంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రులు ఉపన్యాసాలు, అధికారుల హడావుడి కాకుండా అదే గ్రామానికి చెందిన హరావతి అనే దివ్యాంగురాలి మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడిన అనంతరం సభా వేదిక వద్దకు వచ్చిన ఆమె మాట్లాడుతూ.. తనలాంటి దివ్యాంగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపిందంటూ ఆనందం వ్యక్తం చేసింది. కుటుంబానికి భారం కాకుండా తన కాళ్లపై తాను నిలబడి జీవనం సాగించడానికి ప్రభుత్వం అందిస్తున్న ఆరు వేల రూపాయల పింఛన్ ఎంతో తోడ్పాడుతుందన్నారు. పింఛన్‌తోపాటు నెలనెల క్రమం తప్పకుండా అందిస్తున్న రేషన్ సరుకులతో తాను ఎంతో సంతోషంగా ఉన్నానని, తనకు ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ మంజూరు చేయాలని మంత్రులను కోరింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కలెక్టరేట్: నిబంధనలు ఉల్లంఘించే పీఎంపీలు, ఆర్‌ఎంపీలపై కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. డ్రెస్సింగ్ చేసి కట్టు కట్టడం, ప్రథమ చికిత్స చేయడం, నివారించగల వ్యాధులకు ముందస్తు సలహాలు, సూచనలు ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేందుకు సూచనలు ఇచ్చేందుకు మాత్రమే అర్హులన్నారు. పై సూచనలు అతిక్రమించిన వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2002 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అబార్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు చేస్తున్నారని, అవి వికటించి ప్రాణహాని జరుగుతోందన్నారు. వారి సంఘం ద్వారా ఇవ్వబడిన సర్టిఫికెట్లు ఏపీ మెడికల్ కౌన్సిల్‌చే ధ్రువీకరించలేదని, వారు అల్లోపతి వైద్యం చేయడానికి అర్హులు కారన్నారు.

ఖాళీ భూములు దళితులకు పంపిణీ చేయాలి

బూర్జ: తోటవాడ పరిధిలో ఖాళీగా ప్రభుత్వ భూములను గ్రామ దళితులకు పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం, ఉపాధ్యక్షురాలు జి.ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. గ్రామాన్ని శుక్రవారం వారు సందర్శించారు. దళితులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రామంలో నివసిస్తున్న వంద దళిత కుటుంబాలకు సెంటు భూమి కూడా లేకపోవడం బాధాకరమన్నారు. రాజకీయ నాయకులు అండదండలతో కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేయని పక్షంలో దళితులను ఐక్యం చేసి భూములను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కంచిలి: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎస్‌ఐ జి.రాజేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కంచిలి రైల్వేస్టేషన్ ఆవరణలో యువకులు, ఆటో యూనియన్ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. గంజాయి రవాణా, వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి సారించామని, అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య కార్యవర్గం

పొందూరు: మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం జి.శ్యామలరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా కింతలి గ్రామానికి చెందిన పైడి అరుణ, ఉపాధ్యక్షురాలుగా మండల కేంద్రం పొందూరుకు చెందిన బనిశెట్టి కుమారి, కోశాధికారిగా లోలుగు గ్రామానికి చెందిన వీవో జడ్డు లక్ష్మి, కార్యదర్శిగా బాణాం గ్రామానికి చెందిన వీవో పెయ్యల ఆదిలక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా కొంచాడ గ్రామానికి చెందిన ముగడ మంగమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికైన వీరిని ఏపీఎం శ్యామలరావు, వెలుగు సిబ్బంది అభినందించారు.

● **సరుబుజ్జిలి:** మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా పేడాడ మణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఐకేపీ ఏపీఎం కమలకుమారి పాండ్యన్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఇందిరా క్రాంతి భవనంలో జరిగిన సభలో ఈ ఎన్నిక నిర్వహించినట్టు తెలిపారు. అధ్యక్షురాలి మణితో పాటు కార్యదర్శి ఉరిటి భాగ్యలక్ష్మి, కోశాధికారిగా బడద విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఏపీఎం తెలిపారు.


ఇచ్ఛాపురం: కరపత్రాలతో టీడీపీ నాయకులు, మహిళలు


పొందూరు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కూటమి నాయకులు


కోటబొమ్మాళి: సరియాపల్లిలో..

ఇది ప్రజా ప్రభుత్వం

● **నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

నరసన్నపేట/ జలుమూరు/ జలుమూరు (సారవకోట): అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం కోమర్తి, కరవంజ, గుమ్మలపాడు గ్రామాల్లో 100 రోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి కాక ముందే ప్రజలకు దగ్గరయ్యామని, దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అంద జేస్తామన్నారు. దాచుకోవడం దోచుకోవడం మాత్రమే తెలిసిన వైసీపీ నాయకులు ఇదేళ్లలో తీసుకురాలేని సంస్కరణలను చంద్రబాబు 100 రోజుల్లోనే తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన నేతలు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, బలగ ప్రవీణ్, వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, కత్తిరి వెంకటరమణ, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ధర్మాన తేజకుమార్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

● **శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**

అరసవల్లి: ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన చేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక జడ్పీ కార్యాలయం ఎదురుగా గల ఏపీహెచ్‌బీ కాలనీ, కార్గిల్ విక్టరీ పార్కు వద్ద ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం గల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వందరోజుల పాలన అదుర్స్

● **పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు**

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన అదుర్స్ అని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. శుక్రవారం చాపరలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. నిరుద్యోగులకు డీఎస్సీ వృద్ధులకు పింఛన్ పెంపు అమలు చేసిందని, దీపావళి నుంచి ఉచిత గ్యాస్ అందిస్తు న్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వందరోజుల్లో విధ్వంసం చేయగా కూటమి ప్రభుత్వ అభివృద్ధి చేసి చూపించిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎల్.మధు బాబు, తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీవో చంద్రకుమారి, టీడీపీ నాయకులు సలాన మోహన రావు, బీజేపీ నాయకులు శరత్, పైల బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కళ్లల్లో ఆనందం: కలమట

పాతపట్నం: వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల్లో ఆనందోత్సాహాలు కనిపిస్తున్నాయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. పాతపట్నంలో శుక్రవారం రాత్రి 100 రోజుల మంచి పాలన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.


పాతపట్నం: కరపత్రాలు ప్రదర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట

శతశాతం హామీల అమలే చంద్రన్న లక్ష్యం

● **ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్**

ఆమదాలవలస: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని హడ్కో కాలనీ వెంకయ్యపేట ప్రాంతాల్లో రాష్ట్రంలో వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో వార్డులో టీడీపీ ఇన్‌చార్జి నాగళ్ల మురళీధర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడారు. రాష్ట్రాన్ని ఓ వైపు అభివృద్ధి బాటలో నడపడంతోపాటు అప్పుల బాధల నుంచి కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న దార్శనికుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడం మనందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పీరుకట్ల విశ్వప్రసాద్, ఆనెపు రామకృష్ణనాయుడు, తమ్మినేని గీతాసాగర్, రాజు, డిల్లేశ్వరరావు, భాస్కరరావు, చంద్రశేఖర్, రామ్మోహన్, సూరపునాయుడు, ఎన్ని శ్రీదేవి పాల్గొన్నారు.

100 రోజుల్లో ఎంతో అభివృద్ధి

● **ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్**

ఎచ్చెర్ల: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఎంతో అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. కుప్పిలి గ్రామంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలోకి ముందుకు తీసుకెళ్తున్నట్టు చెప్పారు. మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, సామాజిక పింఛన్ పెంపు తదితర కార్యక్రమాలతో అన్ని వర్గాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చౌదరి నారాయణమూర్తి, పైడి వేణుగోపాలం, విశ్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ స్టిక్కర్లు అతికించి... 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.


సంతబొమ్మాళి: కోటపాడులో ప్రచారం


టెక్కలి: మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీబాయి


ఎల్ఎన్‌పేట: బొర్రంపేట గ్రామంలో..


హరిపురం: బాలిగాంలో ఇంటింటా ప్రచారం


నందిగాం: మొండ్రాయివలసలో..


పోలాకి: ముప్పిడిలో మొక్కలు నాటుతున్న దృశ్యం



జి.సిగడాం, పలాసరూరల్: అల్లుకోలలో కరపత్రాలు అందిస్తున్న కూటమి నాయకులు

వరద బాధితులకు అండగా డీఎస్సీ-98 ఉపాధ్యాయులు


అంగీకార పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

కంచిలి/ గుజరాతీపేట: విజయవాడ వరద బాధితులకు డీఎస్సీ 1998 ఉపాధ్యాయులు తమ ఒక్కరోజు వేతనం రూ.38,11,500 విరాళంగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం కవిటి మండలం రాజపురం గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు అశోక్, శిరీషలకు తమ అంగీకార పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బి.కామేష్ రెడ్డి, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ డీఎస్సీలో మొత్తం 4072 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

శ్రీకాకుళం క్రైం: ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడిపై వచ్చిన ఫిర్యాదుపై డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి, శ్రీకాకుళం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ పాఠశాలకు చెందిన 8, 9 తరగతుల్లో చదువుతున్న కొంతమంది విద్యార్థులు ఫిర్యాదు చేసిన మేరకు వారి తల్లిదండ్రుల నుంచి వ్యక్తిగతంగా, రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. గణిత ఉపాధ్యాయునిపై ఒక్కరు మాత్రమే ఫిర్యాదుచేయగా, మిగిలిన వారు ఆ ఫిర్యాదుతో ఎలాంటి సంబంధం లేదన్నిరు. పాఠశాల హెచ్‌ఎంకు ఉపాధ్యాయుల సహకారం సరిగాలేదని పలువురు తల్లిదండ్రులు డిప్యూటీ డీఈవోకు వివరించారు. ఈ మేరకు ఓ నివేదికను తయారుచేసి డీఈవోకు అందజేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యయుడు జి.శ్రీరాములు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

విజయాదిత్య పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి


సూచనలిస్తున్న కలెక్టర్ పుండ్కర్

అరసవల్లి: విజయాదిత్య పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యాటక అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయాదిత్య పార్కును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్ఎఫ్‌సీ పనులు పూర్తి చేయాలని, రెండు రోజుల్లో గ్రీన్ కార్పొరేషన్ పార్కును పూర్తిగా శుభ్రపరచాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, పర్యాటకాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే టీడీపీ లక్ష్యం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు తిండి, గూడు, గుడ్డ కల్పించడమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీనను ఏర్పాటు చేసి పేదలకు రూ.5కే అల్పాహారం భోజనం, రాత్రి భోజనం అందిస్తే రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలు ఆకలి తీర్చుకుంటున్నాయన్నారు. అటువంటి అన్నా క్యాంటీన్‌ను దుర్మార్గుడైన జగన్‌రెడ్డి రద్దు చేసి పేదవాడి నోటి ముందు ఆహారాన్ని తీసేశారన్నారు. ఇప్పుడు మళ్లీ పేదవాడి ఆకలి తీర్చేందుకే వీటిని తిరిగి ప్రారంభించామన్నారు మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కూటమి నాయకులు రామ్మోహన్, సూరపనాయుడు, తమ్మినేని గీతా, నూకరాజు, డిల్లీశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఎచ్చెర్ల: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం ఉంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. కుప్పిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్, గ్రిగ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తిచూపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కారు పున్నయ్య, తహసీల్దార్ సింహాచలం, కూటమి నాయకులు చౌదరి నారాయణమూర్తి, పైడి వేణుగోపాలం, విశ్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, బల్లాడ జనార్ధనరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తాచాటిన కొవ్వాడ విద్యార్థులు


కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన కొవ్వాడ విద్యార్థులు

రణస్థలం: కోష్ఠ జడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో కొవ్వాడ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. కబడ్డీ సీనియర్స్ జూనియర్స్ విభాగంలో కొవ్వాడ విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. తమ గ్రామానికి చెందిన విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన హెచ్‌ఎం పద్మావతి, పీఈటీ జి.అప్పన్నను టీడీపీ నాయకులు మైలపల్లి పోలీస్ అభినందించారు.

23లోగా పూర్తిచేయాలి

ఎచ్చెర్ల: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ ఈ నెల 23వ తేదీలోగా పూర్తిచేయాలని మండల వ్యవసాయాధికారి వై.సురేష్ కోరారు. రైతు సేవా కేంద్రాన్ని రైతులు సంప్రదించి, గడువులోగా పూర్తిచేయాలన్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

పొందూరు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయ బద్ధంగా ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్న డిమాండ్ చేశారు. మండలంలో పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వచ్చి 100 రోజులు గడిచినా ఐఆర్ గురించి గాని, పీఆర్‌సీ ఏర్పాటు విషయం గాని, జీవో 117 రద్దుపైన గాని ఎటువంటి ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం చేయకపోవడం, ఉపాధ్యాయులను, ఉద్యోగులకు ఆవేదనకు గురిచేస్తోందన్నారు. ఈయనతో పాటు డీటీఎఫ్ నాయకులు తమ్మినేని మురళీమోహన్, మండల ప్రధాన కార్యదర్శి జి.భాస్కరరావు, రాష్ట్ర కౌన్సెలర్ గండెం రామారావు తదితరులు ఉన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

గార: వమరవల్లిలో గల బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంగ్లీష్ పోస్టుకి గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన మహిళా అభ్యర్థులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ డెమో ద్వారా ఎంపిక చేయనున్నట్టు ప్రిన్సిపాల్ వై.చిట్టితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు. బయోడేటా, పీజీ, బీఈడీ, టెట్ (క్వాలిఫైడ్) ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాఠశాలకు రావాలని తెలిపారు.

ప్రాజెక్టులను అభివృద్ధి చేయండి

సోంపేట: సోంపేట, కంచిలి మండలాల పరిధిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని మండల రైతాంగ కమిటీ సభ్యులు శుక్రవారం కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడును కోరారు. ఈ మేరకు కమిటీ సభ్యులు బి.అశోక్, ఎస్.కామేశ్వరరావు, బెందాళం బాబూరావు, మద్దిల నాగేశ్వరరావు, బి.రామారావు తదితరులు వినతిపత్రం అందజేశారు. పైడిగాం చానల్, బారువ గ్రోయిన్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. బేసీ, పలాసపురం పెద్ద చెరువులను మినీ రిజర్వాయర్లుగా మార్చాలని కోరారు. కంచిలి మండలంలోని సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని కోరారు.

మహాసభలు విజయవంతం చేయండి

శ్రీకాకుళం స్పోర్ట్స్: నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో నిర్వహించనున్న 22వ తేదీన నిర్వహించనున్న విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఏపీటీఎఫ్ 80 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కల్తీ ఆహారంపై అవగాహన

గుజరాతీపేట: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో కల్తీ ఆహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫుడ్ అడల్ట్రేషన్, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నిక్స్ అంశంపై కోర్సు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, హెచ్‌వోడీ సూర్య సునీత, కీర్తి, చాందిని, గీతిక తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ ఇన్‌గేట్ మూసివేత

● **ఔట్ గేట్ నుంచే రాకపోకలు** ● **బాధితులకు తప్పని కష్టాలు**

అరసవల్లి: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో గతకొద్ది రోజులుగా వైద్య సిబ్బంది తమ సమస్యలపై నిరసన తెలుపుతుండంతో ఇన్‌గేట్ మూసివేశారు. దీంతో అనారోగ్య సమస్యలపై వస్తున్నవారు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను తీసుకువచ్చే అంబులెన్సులకు సైతం రిమ్స్ లోపలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. గురువారం ఓ 108 వాహనం రాగా రిమ్స్ ఇన్‌గేట్ మూసి ఉంచడం.. ఔట్ గేట్ నుంచి ఇతర వాహనాలు రావడంతో లోపలకి వెళ్లలేక అక్కడే ఉండిపోయింది. ఈ సమయంలో గేట్ తీయాలని సెక్యూరిటీ సిబ్బందిని కోరినా.. వారు అధికారుల ఆదేశాల మేరకు మూసేశామని చెప్పేశారు. చేసేదేమీలేక కాసేపటి తర్వాత ఆసుపత్రి ఔట్ గేటు గుండా లోపలికి వెళ్లారు. దీంతో రోగులు, వారి బంధువులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రిమ్స్ ఇన్‌గేట్ మూసి ఉంచడంతో ఔట్‌గేట్ నుంచి వెళ్తున్న 108 వాహనం